క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యం సూచించారు. డివిజన్‌లో గురువారం ఆమె పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమృత్ పథకంలో భాగంగా కొత్తగా వేసిన రోడ్లు సైతం తవ్వేస్తున్నారని దీనివల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. దీంతో ఆమె అధికారులతో మాట్లాడి బాగున్న రోడ్లను ప్రజలకు ఇబ్బంది కలిగేలా తవ్వవద్దని సూచించారు. ఒక వేళ తవ్వినప్పటికీ పనులు పూర్తయిన వెంటనే రోడ్డుకు అవసరమైన మరమ్మతులు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంగిరేకుల విజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల మరమ్మతులకు విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు పశువైద్యశాల మరమ్మతులకు గురువారం షిరిడీ సాయిబాబా మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ మందిర కమిటీ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాల్లో భాగంగా పశువైద్యశాల మరమ్మతులకు విరాళం అందజేస్తున్నామన్నారు. భక్తులు, దాతల సహకారంతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ ఉపయోగపడే పశువైద్యశాలకు తమ వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామన్నారు. పశువైద్యశాల లైవ్‌స్టాక్ ఆఫీసర్ రామకృష్ణ మాట్లాడారు.

సచివాలయ భవనానికి మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ పరిధిలోని 242, 246 వార్డు సచివాలయ భవనాల మరమ్మతులకు గురువారం కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డి శంకుస్థాపన చేశారు. మూడు లక్షల వ్యయంతో పనులు చేపట్టామని తెలిపారు. నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దబాబు, జీ శ్రీనివాస్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శరాబందీరావుకు డాక్టరేట్ ప్రదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌కు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖ సేవాతత్పరుడు అన్నాబత్తుల శరాబందీరావుకు హోప్ థియోలాజికల్ యూనివర్శిటీ ఆధ్వర్యాన గౌరవ డాక్టరేట్ అందజేశారు. హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం జరిగిన గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాలాచారి చేతులమీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న శరాబందీరావును లయన్స్ క్లబ్ సభ్యులు, మధురానగర్ వాసులు అభినందించారు.

ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రిపైగల దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్‌లో కొండ రాళ్లు పడిన ప్రదేశాన్ని దేవస్థానం పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఘాట్ రోడ్‌లో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేస్తున్న రక్షణ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా మరిన్ని రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమ, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ గుణదల కార్మెల్‌నగర్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. పాలనలో గొప్ప మార్పునకు సంకేతం జగనన్న సురక్ష అని తెలిపారు. ప్రజా సమస్యలు, పౌర సేవలు సంతృప్తి స్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం నెల రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 32,794 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశామని వెల్లడించారు. విజయవంతంగా నిర్వహించిన అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు ఉన్నాన్నారు. అన్ని శాఖల అధికారులు ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడం వినూత్నమన్నారు. ఒకటో డివిజన్లో 465 మందికి కుల, 425 మందికి ఆదాయ, ముగ్గురు ఈడబ్ల్యూఎస్, 10 మందికి బియ్యం కార్డులతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 1,647 సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, సేవలతో సంతృప్తి చెందిన లబ్దిదారులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ 9052690526 నంబర్‌కి ఎస్ఎంఎస్ చేయాలని కోరారు. అనంతరం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఓయూసీడీ శకుంతల, నార్త్ తహసీల్దార్ మాధురి, అసిస్టెంట్ కమిషనర్ -2 అనసూయ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దంటి సురేష్, బండి వేణు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• నవజాతకు ఉచిత వైద్యం





విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు విభాగంలో ఏర్పాటు చేసిన స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఎన్ఐసీయూ) అందుబాటులోకి వచ్చాయి. నవజాత శిశువులకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్యం ఉచితంగా అందించేందుకు రూ.5.53 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ వైద్య విభాగాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, పిడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – లబ్బీపేట(విజయవాడతూర్పు)

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపు నిచ్చారు. 62వ డివిజన్ ఆహ్వానం కల్యాణ మండపంలో 30, 32, 57, 58, 59, 60, 61, 62, 63, 64 డివిజన్ల బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కమిటీ సభ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయించాలని సూచించారు. బీఎల్ఏ లకు ఎన్నికల ఘట్టం ఎంతో ప్రధానమైందని చెప్పారు. గృహసారథులు, కన్వీనర్లు కూడా అంతే బాధ్యతగా ఉండాలని తెలిపారు. ఫామ్ 6,7,8 పట్ల పూర్తి అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులుంటారని ప్రతి ఓటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వైనాట్ 175 అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న విషయాన్ని బాధ్యతగా తీసుకొని పని చేయాలన్నారు. బూత్‌లెవెల్ ఏజెంట్లు చేస్తున్న విధుల పట్ల కార్పొరేటర్లు పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అవసరమైతే వారితో సమీక్షించాలని పేర్కొన్నారు. డబుల్ ఓటర్లు అంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పరిశీలిస్తే 2019 కంటే ముందుగా డబుల్ ఓటర్ల నమోదు జరిగినట్లు తేలిందన్నారు. నకిలీ, దొంగ ఓట్లను గుర్తించి బీఎల్ఏ కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గాన్ని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, ఇసరపు దేవి, ఎండీ షాహినా సుల్తానా, ఉమ్మడి రమాదేవి, యరగొర్ల తిరుపతమ్మ, బీహెచ్ జానారెడ్డి, నందెపు జగదీష్, డివిజన్ల ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు వసతులు కల్పించాలి

జిల్లా న్యాయసేవాధికారి కేవీఆర్ కృష్ణయ్య



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లైంగికదాడులకు గురైన మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని కృష్ణా జిల్లా న్యాయసేవాధికారి, న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య తెలిపారు. పాత ప్రభుత్వాసుపత్రిలోని దిశ వన్ స్టాప్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. దిశ కేంద్రం ద్వారా మహిళలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దిశ కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, సఖీ సిబ్బంది డి. స్వప్న, పారామెడికల్ స్టాఫ్‌ను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెనలు

ఎన్టీఆర్ జిల్లాలో 40 మందికి రూ.6.34 కోట్ల లబ్ధి



విదేశీ విద్యా కానుక చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులు ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీల్లో చదవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకే జగనన్న విదేశీ విద్య దీవెన పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం విదేశాల్లో చదవాలనుకునే పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తోందన్నారు. జగనన్న విదేశీ విద్య దీవెన పథకం కింద అర్హులైన పేద విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో మొదటి, రెండో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాలో 31 మంది విద్యార్థులకు రెండో విడత రూ.4.92 కోట్లు, తొమ్మిది మందికి మొదటి విడతగా రూ.1.42 కోట్ల చొప్పున రూ.6.34 కోట్లు అందజేశామన్నారు. పేద విద్యార్థులు కూడా ప్రపంచంలో టాప్ యూనివర్సిటీల్లో చదివించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు కార్యరూపమే జగనన్న విదేశీ విద్య దీవెన పథకమని వివరించారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విదేశాల్లో రెట్టించిన ఉత్సాహంతో ఉన్నత విద్య అభ్యసించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

కుటుంబ వార్షికాదాయ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.8 లక్షలకు పెంచడంతో ఎక్కువ మందికి ఈ పథకం కింద ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విదేశీ విద్యా దీవెన వంటి పథకం అమలవుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మాదు శివరామకృష్ణ, తోలేటి శ్రీకాంత్, గీతాంజలి దేవి, మనోజ్ కొఠారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ ఎం.విజయభారతి, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

వరుణ్ కార్డియాక్‌లో న్యూరో సేవలు



డాక్టర్ పువ్వాడ రామకృష్ణకు అభినందనలు తెలుపుతున్న గుంటూరు వరుణ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇప్పటి వరకూ గుండె వైద్య సేవలు అందించిన వరుణ్ కార్డియాక్ సెంటర్‌లో న్యూరో సేవలు అందుబాటులోకి వచ్చాయి. నగరానికి చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ ఇక్కడ సేవల అందించనున్నారు. దీంతో ఇక నుంచి వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరోసైన్సెస్‌గా రూపాంతరం చెందినట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. ఇక నుంచి కార్డియాలజీ, న్యూరాలజీకి సంబంధించి విస్తృతమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని వరుణ్‌కార్డియాక్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ పువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ అధునాతన న్యూరో సర్జరీ సేవలతో పాటు, తలకు గాయాలు. మెదడు, వెన్నెముక సమస్యలు, చిన్నపిల్లలు, నవజాత శిశువుల్లో నాడీ సంబంధ వ్యాధులకు సమగ్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రముఖ ఫేషియల్ సర్జన్ డాక్టర్ ఈదర సురేంద్ర పాల్గొన్నారు.

తప్పుడు సమాచారంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కిడ్నీ దానం చేసే విషయంలో తహసీల్దార్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బాలభాస్కర్ నగర్‌కు చెందిన గాడి చిన్ని కూలీ పనులకు వెళుతోంది. ఆమె భర్త సురేష్ జ్యూస్ షాపులో పనిచేస్తున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నల్లమిల్లి దీపక్ రెడ్డి తన అన్న అని, కిడ్నీ దానం చేసేందుకు సర్టిఫికెట్ జారీ చేయాలని చిన్ని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసింది. విచారణలో గాడి చిన్ని , నల్లమిల్లి దీపక్ రెడ్డికి మధ్య ఎటువంటి రక్త సంబంధం లేదని తేలింది. వారిద్దరు వేర్వేరు కులాలకు చెందిన వారని తేలింది. దీంతో తప్పుడు సమాచారం ఇచ్చిన గాడి చిన్ని ఆమె భర్త సురేష్ పై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనండి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పటమట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ నగరాలకు నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో విజయవాడ నగరపాలక సంస్థ పాల్గొంటుందని, ఈ ఏడాది జరిగే ఈ సర్వేలో నగర వాసులు తమ అభిప్రాయాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలపాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సుర్వేక్షన్ 2023 ఫీడ్ బ్యాక్ లో పాల్గొనేందుకు హెచ్‌టీటీపీఎస్://వీఎఫ్‌సిటీ-పీఆర్‌వోడీడాట్ఎస్‌బీఎం అర్బన్ఓఆర్‌జీ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్‌మైజీవోవీడాట్ఇన్/మైజీవోవీ-సర్వే-స్వచ్ఛ సర్వేక్షణ్-2023/ లింక్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్/ఆప్ స్టోర్ నుంచి స్వచ్ఛత యాప్ 2023లో ఓట్ ఫర్ మై సిటీ ఆప్షన్‌లో 4 విధాల్లో స్వచ్ఛ సుర్వేక్షణ్ 2023 ఫీడ్ బ్యాక్ ను అందించవచ్చని పేర్కొన్నారు. ఈ లింక్లు/ఆప్ లోకి వెళ్లాక ప్రతి ఒక్కరూ మొబైల్ నెంబర్‌ను నమోదు చేయాలని తెలిపారు. దానికి ఓటీపీ (ఒన్‌టైం పాస్‌వర్డ్) వస్తుందని, ఆ పాస్‌వర్డ్‌ని నమోదు చేస్తే భాష ఎంపిక అనంతరం ఫీడ్‌బ్యాక్‌ఇచ్చే వారి వివరాలు, రాష్ట్రం, జిల్లా, నగరం, ప్రదేశం పేరు, లింగము, వయస్సు నమోదు చేయాలని సూచించారు. అవన్నీ నమోదు చేసిన తర్వాత సర్వే ప్రారంభమవుతుందన్నారు. 9 ప్రశ్నలకు అభిప్రాయం తెలపాలని కోరారు. వ్యర్థాల సేకరణ, వ్యర్థాల విభజన, నగర శుభ్రత, రీ సైకిల్, రీ యూస్, రెడ్యూస్ కేంద్రాలు, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు వంటి అంశాలపై నగర పరిశుభ్రతను పరిగణలోకి తీసుకొని అభిప్రాయాన్ని నమోదు చేయాలని కోరారు.

మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలామ్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు



అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆజాద్ ముస్లిం కమిటీ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కడు పేదరికంలో జన్మించి దేశ అత్యుత్తమ వ్యక్తి స్థాయి వరకూ ఎదిగిన ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని, ప్రపంచ గర్వించదగిన మహోన్నతవ్యక్తి ఆయన అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కొనియాడారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. స్థానిక పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన తొలుత కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రుహుల్లా మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే మాటకు నిలువెత్తు రూపం అబ్దుల్ కలామ్ అని తెలిపారు. సామాన్య పేపర్‌బాయ్ నుంచి అసామాన్య రాష్ట్రపతి స్థాయి వరకూ ఎదిగిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచిన ఆ మహనీయుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎంకే బేగ్ స్కూల్ హెచ్ఎం ఎమ్ఎమ్ ఇమామ్‌బాషా, ఆర్య వైశ్యసంఘం నాయకులు గార్లపాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, చింతా శ్రీను, కొండా జయలక్ష్మీ, షేక్ అమిత్, గెల్లిపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ముస్లీం కమిటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో జరిగింది. ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ముఖ్యఅతిథిగా విచ్చేసి అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేటి యువతకు అబ్దుల్ కలామ్ జీవితం ఆదర్శనీయమని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. ఆజాద్ ముస్లీం కమిటీ నాయకులు సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, బిలాల్, మునీర్‌అహ్మద్, జలీల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలుగా కేంద్రీయ విద్యాలయాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్‌వీ రావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2020 జాతీయ విద్యా విధానం వల్ల కేంద్రీయ విద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి మోడల్ పాఠశాలలుగా మారాయని విజయవాడ కేంద్రీయ విద్యాలయం-1 ప్రిన్సిపాల్ ఎన్‌వీ రావు తెలిపారు. సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టి మూడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ కేంద్రీయ విద్యాలయం ప్రథమ స్థానం సంపాదించిందన్నారు. పాఠశాల ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పాఠశాల డిజిటలైజేషన్ మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి రూ.కోటి ఐదు లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా పాఠశాలకు చక్కటి ల్యాబ్‌లు మోడల్ విద్యా విధానాన్ని అభ్యసించడానికి కావాల్సిన ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకొన్నామని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 భాగంగా మూడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29వ తేదీన దేశ రాజధానిలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని తమ పాఠశాల విద్యార్థులకు చూపించే విధంగా లైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీఎస్‌వీఎస్ఆర్ కృష్ణ, సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్స్ మీనూజోషి, శేఖర్ చంద్రన్, ఎం.వెంకటేశ్వరరావు, వీపీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తదితరులు పాల్గొని నూతన జాతీయ విద్యావిధానం ప్రాధాన్యత , వివిధ అంశాల్లో అమలు చేస్తున్న విధానాలపై విశ్లేషణ చేశారు. నూతన విద్యా విధానంలో భాగంగా అమలు చేస్తున్న నిపుణ్‌భారత్, ఫౌండేషన్ లిటరసీ, అండ్ న్యూమరసీ, బాలవాటిక, పీఎం ఇ-విద్య , విద్యాంజలి, అటల్ టింకరింగ్ ల్యాబ్, టీచర్‌ల శిక్షణ అంశాల గురించి మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటారు. సీబీఎస్ విద్యాబోధన పాఠశాలల ప్రిన్సిపాల్స్ పలువురు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలని వినతి



ప్రభుత్వ సలహాదారు సజ్జలకు వినతి పత్రం ఇస్తున్న సుశీల రెడ్డి, నరసింహారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెడ్డి సామాజిక వర్గంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలు శుభ కార్యక్రమాలు, చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు నగరంలో కల్యాణ మండపాన్ని నిర్మించేకునేందుకు స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పులుగు సుశీల రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు బిక్క నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం తాడేపల్లిలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు వివిధ జిల్లాల నుంచి వలస వచ్చి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. ఆయా కుటుంబాలు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఇళ్ల ముందు రోడ్డుపైనే చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ కల్యాణమండపాల అద్దెలను భరించే ఆర్థిక స్తోమత లేదన్నారు. కాగా వినతి పత్రాన్ని పరిశీలించిన సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ కనకదుర్గనగర్ ఫీడరు పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, షాదీఖానా, నూజివీడు రోడ్డు, నూకాలమ్మ గుడి రోడ్డు, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు, వశిష్ట కాలనీ, ఆర్అండ్‌బీ ప్లాట్స్, ఆంధ్రప్రభకాలనీ, ఆంధ్రపత్రిక కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులంతా గమనించి తమకు సహకరించాలని కోరారు.